## ఆగస్టు కోటా కావేరి నీరు జూలైలోనే విడుదల

**బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** కావేరి జలాశయాలకు భారీగా వరద పోటెత్తుతుండడంతో కావేరి నీటి నియంత్రణా మండలి తీర్మానించిన కోటా కంటే ఎక్కువగా నీటిని తమిళనాడుకు విడుదల చేశారు. జూలై ఆఖరు నాటికి 40.43 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉండగా అధికంగా 36.34 టీఎంసీల నీరు విడుదల చేశామని కేఆర్ఎస్ ఇంజనీర్లు ప్రకటించారు. జూలై 29 నాటికే 86.17 టీఎంసీల నీరు విడుదల చేశామన్నారు. ఆగస్టు చివరినాటికి విడుదల చేయాల్సిన కోటా పూర్తి చేశామన్నారు. 1995 కావేరి ట్రిబ్యునల్, కావేరి నీటి నిర్వహణా ప్రాధికార నిర్ణయించిన దానికంటే ఎక్కువగా నీరు విడుదలయిందన్నారు.

## హస్తినలో కన్నడ నేతల..

# హల్‌చల్..!

- జలవనరుల ప్రాజెక్టులకు సహకరించండి
- ప్రధానికి డీసీఎం డీకే శివకుమార్ వినతి
- అమిత్‌షాను కలిసిన విజయేంద్ర
- రక్షణమంత్రితో గవర్నర్ భేటీ



ప్రధాని మోదీని సన్మానిస్తున్న డీకే శివకుమార్

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం ఢిల్లీలో హల్‌చల్ చేశారు. వేర్వేరు కార్యక్రమాలతో ముఖ్యులతో భేటీలు అవుతూ సందడిగా గడిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి పలు అభివృద్ధి పనులను వివరించి ప్రత్యేక గ్రాంట్ల ద్వారా సహకరించాలని విన్నవించారు. జలవనరుల ప్రాజెక్టులకు సహకరించాలని కోరారు. అనంతరం జలశక్తి మిషన్, హౌసింగ్‌శాఖ మంత్రులతో భేటీ అయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను భేటీ అయ్యారు. మరో రెండు రోజుల్లో ముడా ఇంటి స్థలాల అవినీతిలో ముఖ్యమంత్రి భాగస్వామ్యం ఉందని పాదయాత్ర చేపడుతున్న తరుణంలో హోంమంత్రిని భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరోవైపు ఇరు పార్టీల అగ్రనేతలు కేంద్రం పెద్దలతో భేటీ కాగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిశారు.

### మేకెదాటుకు సహకరించాలని కోరా : డీసీఎం

బెంగళూరు నగరంతోపాటు అనుబంధ ప్రాంతాల్లో శాశ్వతంగా తాగునీటికి అనుకూలమయ్యే మేకెదాటు ప్రాజెక్టుతోపాటు పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇచ్చామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ప్రధానమంత్రిని భేటీ అయిన తర్వాత కర్ణాటక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు అత్యంత ఎక్కువపన్నులు చెల్లించే నగరమని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక గ్రాంట్లు కేటాయించలేదన్నారు. ఇదే విషయాన్ని ప్రధానమంత్రికి వివరించానని తెలిపారు. గిఫ్ట్ సిటీ తరహాలో బెంగళూరును పరిగణించాలని కోరామని అన్నారు. దేశంలో ఒకే నగరానికి గిఫ్ట్ సిటీ చేసేందుకు సాధ్యమని, రెండు మూడు నగరాలను చేయలేమని ప్రధాని వివరించారన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించారని, ఆ నిధులు విడుదల చేయాలని కోరామన్నారు. రానున్న బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని తెలిపారు. తమిళనాడుకు జూలై దాకా 40 టీఎంసీల కావేరి నీరు విడుదల చేయాల్సి ఉండేదని, ఇప్పటి వరకు 84 టీఎంసీలు విడుదల చేశామని వివరించామన్నారు. మేకెదాటు అంశంపై ఇరు రాష్ట్రాలు సమస్యను పరిష్కరించుకుంటే ఉత్తమమని ప్రధాని సూచించారని తెలిపారు. మహదాయి సమస్యను పరిష్కరించాలని విన్నవించామన్నారు. బడ్జెట్‌లో కర్ణాటకకు ప్రత్యేక గ్రాంట్లు రాలేదని, సాగునీటి ప్రాజెక్టులకు కనీస స్థాయిలో కూడా ప్రస్తావించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. బెంగళూరు నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణతోపాటు భవిష్యత్తులో సమస్యలు లేకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించదలిచామన్నారు. హోసూరు - బళ్లారి రోడ్డు, కేఆర్‌పురం - మైసూరు రోడ్డు ప్రాంతాల్లో సొరంగ మార్గం నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని జాతీయ రహదారి ప్రాధికార ద్వారా సహకరించాలని కోరామన్నారు. నమ్మ మెట్రో రైలు ప్రజలకు అనుకూలంగాను, రవాణాకు సులభతరంగా ఉందని, తొలి విడత సంపూర్ణంగా సేవలందిస్తోందని, రెండో విడత పనులు సాగుతున్నాయని, మూడో విడతకు డీపీఆర్‌కు కేంద్రం ద్వారా అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. మెట్రో, ఫ్లై ఓవర్ వంటి డబుల్ డెక్కర్‌లకు సహకరించాలని కోరామన్నారు. బెంగళూరుకు ఇతర ప్రాంతాలనుంచి వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నందున నగరం చుట్టూ 73 కిలోమీటర్ల మేర పెరిఫెరల్ రోడ్డు నిర్మాణానికి రూ.27వేలు అవసరమని, ఇందులో రూ.21వేల కోట్లు భూస్వాధీనానికి కేటాయించాల్సి ఉంటుందని, రూ.6వేల కోట్లు నిర్మాణాలకు అవసరమని కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాలని కోరామన్నారు. వాతావరణంలో మార్పులతో బెంగళూరులో అధిక వర్షాలు కురిస్తే వర్షపు నీరు సమగ్రంగా బయటకు పంపేలాంటి కాలువలు లేవని, అందుకు అనుగుణంగా రూ.3వేల కోట్లతో ప్రపంచబ్యాంకుకు ప్రతిపాదనలు పంపామని అనుమతులు ఇప్పించాలని కోరామన్నారు. బెంగళూరు పరిసరాలలో నీటి వనరుల అభివృద్ధికి 15వ ఆర్థిక కమిషన్ సిఫారసులకు అనుగుణంగా రూ.6వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని ప్రస్తావించాలని, తద్వారా పునరుజ్జీవనం కోసం పికప్ డ్యామ్‌లు, బ్యారేజ్‌లు, చిన్న చెరువుల నిర్మాణం ఎత్తిపోతల పథకాలకు సహకరించాలని విన్నవించామన్నారు. బెంగళూరులో 6,500 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, వీటిని శాస్త్రీయంగా విభజన చేసేందుకు 8 విభాగాల ఏర్పాటుకు స్వచ్ఛభారత అభియానలో రూ.960 కోట్లు కేటాయించాలని కోరామన్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంలో కర్ణాటకకు న్యాయబద్ధంగా నీటి కేటాయింపులు పెంచాలని తెలిపామన్నారు. ప్రధానిని కలసిన తర్వాత కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను భేటీ అయి సమగ్ర నివేదికలు ఇచ్చామని తెలిపారు. రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణ కలసి వచ్చారని వివరించారు. కేంద్ర వసతి, నగరాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలసి బెంగళూరు నగర అభివృద్ధికి సంబంధించి ప్రాజెక్టుల నివేదికలను వివరించామని తెలిపారు.



కేంద్ర వసతి, నగరాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో డీసీఎం డీకే శివకుమార్

### తమిళనాడుకు రికార్డు స్థాయిలో నీరు

తమిళనాడుకు రికార్డు స్థాయిలో కావేరి నీరు విడుదల చేశామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మంగళవారం దాకా 2.25 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని వివరించారు. తొలిసారి ఇంతస్థాయిలో నీటిని విడుదల చేయడం రికార్డు అన్నారు. కావేరి తీర ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించామన్నారు. కేరళ రాష్ట్రం వయనాడ్‌లో భారీగా వర్షాలు కురుస్తున్నందున కేఆర్ఎస్, కబిని జలాశయాలకు ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని, ఆ మేరకు ఆ ప్రాంతంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ముడా అక్రమాలపై బీజేపీ చేపడుతున్న పాదయాత్రను దీటుగా ఎదుర్కొంటామని, అందుకు ఏం చేయాలనేది ప్రకటిస్తామని అన్నారు. పాదయాత్రకు జేడీఎస్ మద్దతు లేదని కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటన విషయం తెలియదంటూ దాటవేశారు.

### హోంమంత్రితో విజయేంద్ర భేటీ

ముడాలో ఇంటి స్థలాల అవినీతికి సంబంధించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబీకుల భాగస్వామ్యాన్ని నిరసిస్తూ చలో మైసూరు పాదయాత్ర చేపట్టనున్న తరుణంలోనే రాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదం చెలరేగింది. నాలుగైదు నెలల క్రితం మైత్రి ఏర్పడిన బీజేపీ-జేడీఎస్ పార్టీల మధ్య తొలి భిన్నమైన పోరాటం పాదయాత్రగా మారుతోంది. ఇదే తరుణంలోనే బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర భేటీ అయ్యారు. అనంతరం విజయేంద్ర 'ఎక్స్' ద్వారా పలు విషయాలు పంచుకున్నారు. పార్టీ సంఘటనాత్మక అంశాలపై హోంమంత్రితో చర్చించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి సంబంధించి వివరాలు అందించామని, కర్ణాటకలో బీజేపీ పాటిస్తున్న విధానాలు, పోరాటాలకు ప్రత్యేకంగా అభినందించారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రేరణ ఇచ్చేలా ఉత్సాహం కల్పించారన్నారు. ఇదే విషయమై దక్షిణకన్నడ జిల్లా బంట్వాళలో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ చలో మైసూరు పాదయాత్ర ప్రకటించే సమయానికి వయనాడ్‌లో భీకరమైన సంఘటన జరగలేదన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితో చర్చలు జరిపి పాదయాత్ర అంశాన్ని ప్రకటిస్తామన్నారు. పాదయాత్రకు జేడీఎస్ సహకరించదని కేంద్రమంత్రి కుమారస్వామి వ్యాఖ్యలపై ఇది తమ అంతర్గత విషయమని, చర్చలతో పరిష్కరించుకుంటామన్నారు. కాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారు చర్చించుకున్నారు.



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్

## ముడా, వాల్మీకి అక్రమాలపై రాహుల్ ఆగ్రహం

- 14 నెలల్లోనే ఏమిటీ ఆరోపణలు?
- సుదీర్ఘ వివరణ ఇచ్చిన సీఎం, డీసీఎం

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నిధుల అవినీతి వ్యవహారంలో రాష్ట్ర నేతలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో రాహుల్‌గాంధీని భేటీ అయ్యారు. ఇదే సందర్భంలో ముడా ఇంటి స్థలాల పంపిణీలో అక్రమాలపై బీజేపీ పోరాటాన్ని ఆరా తీశారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నిధులు ఇతరత్రా వినియోగించడంపై వస్తున్న ఆరోపణలపై రాహుల్‌గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర నాయకులపై విరుచుకుపడినట్టు సమాచారం. శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజారిటీ ఇచ్చారనే విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. బీజేపీ పాలనలో అవినీతితో విసుగు చెంది కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని, 14 నెలల్లోనే ఏమిటీ ఈ అవినీతి అంటూ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. బీజేపీ నాయకులు రోజూ పోరాటం చేస్తున్నారని, పార్లమెంటులో ప్రస్తావించారని ఇది తమ గౌరవానికి భంగం కలిగినట్టు అయిందని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను ముందుపెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో వెళ్లామని, వారి సంక్షేమమే మన లక్ష్యమన్నారు. వారి నిధులే కాజేశారని, దళితులకు అన్యాయం చేశారనే బీజేపీ ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొట్టలేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ రెండు అంశాలపై మంగళవారం పార్టీ అగ్రనేతలకు సీఎం, డీసీఎం సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఎక్కువ సమయం కేటాయించి వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందనే వివరణకు రాహుల్ సమ్మతించ లేదని తెలిసింది. దాదాపు గంటన్నరపాటు జరిగిన చర్చల్లో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలాలు భాగస్వామ్యులయ్యారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కనీసమైన గ్రాంట్లు లేవని, కర్ణాటక నుంచి ఎన్నికైన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ధోరణిని వ్యతిరేకించే తరహాలో వ్యవహరించలేదని రాహుల్ గాంధీ మండిపడినట్టు తెలుస్తోంది.



ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో రాహుల్‌గాంధీతో సీఎం, డీసీఎం తదితరులు




## ముడా అవినీతిపై వివరణ కోరిన గవర్నర్

- అధికార దుర్వినియోగం చేస్తే పోరాడుతాం : మంత్రులు

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాల పంపిణీ వివాదంలో అవినీతి ఆరోపణలపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ స్పందించినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను రాజ్‌భవన్ వివరణ కోరినట్టు సమాచారం. జూలై 25న బీజేపీ ఎమ్మెల్యేల బృందం గవర్నర్‌ను కలసి ముడా అవినీతిపై సీఎం రాజీనామా డిమాండ్‌తోపాటు సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వివరణను కోరారు. గవర్నర్ స్పందించిన తీరుపై రాష్ట్ర మంత్రులలో ఆందోళన మొదలైంది. రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ ఇది రాజకీయ ప్రేరేపితమన్నారు. గవర్నర్‌కు రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని, వాటి హద్దుల్లోనే పాటించాల్సి ఉంటుందన్నారు. హద్దుమీరితే అనుమానాలకు దారి తీస్తుందని అన్నారు. ఒకవేళ గవర్నర్ షోకాజ్ నోటీసు జారీ చేస్తే తాము రాజకీయ ప్రేరేపితమని పరిగణించాల్సి ఉంటుందన్నారు. గవర్నర్‌ను బీజేపీ వారు దుర్వినియోగం చేసుకుంటున్నారని మరో మంత్రి ప్రియాంక ఖర్గే ఆరోపించారు. తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో గవర్నర్లను చూశామని, వారు రాజ్యాంగబద్ధమైన హోదాను దుర్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యవైఖరిపై గవర్నర్ ఎలా జోక్యం చేసుకుంటారని మండిపడ్డారు. ఐటీ, ఈడీలను ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ అన్నింటికీ వాడిందని, ప్రస్తుతం గవర్నర్లకు మార్గదర్శకాలు జారీచేస్తోందన్నారు.

### సుప్రీంకోర్టులో పోరాడుతాం

### - రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ

ప్రతిపక్షాలు ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేశాయని.. గవర్నర్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే సుప్రీంకోర్టులో పోరాటం చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ వెల్లడించారు. తమ ప్రభుత్వానికి కూల్చేందుకు కుట్ర పన్నితే పోరాటానికి వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. బుధవారం కొడగు జిల్లాలో ఆయన కొన్ని ప్రాంతాలను పర్యటించారు. హాసన్ జిల్లా సకలేశపుర తాలూకా దొడ్డతప్పలే వద్ద భూమి కుశించికుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గవర్నర్‌కు పిటిషన్లు ఇచ్చి ఆయన ద్వారా ఏదైనా చేయాలని కుట్ర పన్నితే చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించినట్టే అన్నారు. ప్రజాభిమానం కల్గిన సీఎం సిద్దరామయ్యను వివాదాల్లో ఇరికించి ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరుగుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రభుత్వం ఏర్పాటు చేశామని, వివాదాలతో ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మా ప్రభుత్వాన్ని అనవసరంగా ఇబ్బందిపెడితే చేతులు కట్టుకుని కూర్చునేది లేదని, ఎంతటి సవాళ్లు అయినా ఎదుర్కొనేందుకు సిద్ధమన్నారు. ముడాలో అవినీతి ఆరోపణలపై కమిషన్ ఏర్పాటు చేశామని, నివేదికలో తేలుతుందన్నారు.



థావర్‌చంద్ గెహ్లోట్

### నిపుణుల అభిప్రాయం కోరిన గవర్నర్

ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ముడా ఇంటి స్థలాల అవినీతి ఆరోపణలు రావడంతో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని కోరినట్టు తెలుస్తోంది. ముడాకు సంబంధించి న్యాయనిపుణుల సలహాలను గవర్నర్ తీసుకోదలచినట్టు సమాచారం. కాగా గవర్నర్ ఢిల్లీలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను భేటీ కావడం చర్చనీయాంశమైంది.



కొడగు జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ, మంత్రి బోసరాజు

## వయనాడ్‌లో వర్షబీభత్సం


- రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం
- జిల్లా అధికారులతో సమీక్షించిన సీఎం

# కావేరి తీర జిల్లాల్లో అలర్ట్!

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** కేరళ రాష్ట్రం వయనాడ్‌లో భారీ వర్షాలతో అతలాకుతలమైన విషయం తెలిసిందే. వయనాడ్ ప్రాంతంలో నిరంతరంగా వర్షాలు హోరెత్తిస్తుండడంతో కావేరి నదికి అనుబంధమైన జిల్లాల్లో అలర్ట్ ప్రకటించారు. వయనాడ్‌లో కురిసే వర్షం ద్వారానే కావేరి నదికి అనుబంధమైన కేఆర్ఎస్, కబిని జలాశయాలకు వరద చేరుతుంది. మరోవైపు రాష్ట్రంలోని కావేరి తీరంతోపాటు మలెనాడు, తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాటు మహారాష్ట్రలో వర్షాలతో ఉత్తరకన్నడ జిల్లాలోని బెళగావి, బాగల్కోటె ప్రాంతా ల్లో భారీగా వరద పోటెత్తుతోంది. ఈ నేపథ్యంలో కేరళలో చోటు చేసుకున్న వర్షబీభత్సంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవల రాష్ట్రంలోనూ ఉత్తర కన్నడ, చిక్కమగళూరు, బాగల్కోటె, హాసన్ జిల్లాల్లో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మరోవైపు నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రభావం ఎక్కడికి దారి తీస్తుందోనని జిల్లా స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు వరద పీడిత జిల్లాలు, జలాశయాలు ఉండే జిల్లాల అధికారులు, జిల్లా పంచాయతీ సీ ఈఓలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతివృష్టి, వర్షపు నష్టాలు, వరద, కొండచరియలు విరిగిపడిన ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని సూచించారు. అన్నిశాఖలు సమన్వయంతో కార్యాచరణ కొనసాగించాలని ఆదేశించారు. చిక్కమగళూరు జిల్లాలో పలు చోట్ల ఇళ్లు నీట మునగడం, కొండ చరియలు పడ్డం, రైల్వేట్రాక్‌పై అడ్డంకులు ఏర్పడ్డం వంటి సంఘటనలు చర్యలు తీసుకోవాలని సూచించారు వర్షాలు నిర్ణీత స్థాయికి మించి కురుస్తున్నాయన్నారు. మరోవైపు మహారాష్ట్ర, కేరళ ప్రాంతంలో వర్షాలతో వరద పోటెత్తుతోందని తద్వారా జరిగే నష్టాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలవారీగా పరిస్థితిని అంచనా వేశారు.



బెళగావి జిల్లా ముసుగుప్పి గ్రామంలో నీట మునిగిన ఇళ్లు (ఫైల్)



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1631.47 | 1,624.91 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 52,414 | 46,669 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 63,419 | 2,099 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 99.70 | 76.19 |

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బాలికల నృత్య ప్రదర్శన

**బళ్లారి సిటీ,జూలై 31:** కౌల్‌బజార్ టైలర్ వీధిలోని శ్రీ పాండురంగాలయంలో బుధవారం ఏకాదశి సందర్భంగా విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన భజన బృందాల వారు తమ భజనలతో అలరించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజం అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి దుర్గోజిరావ్, రమేశ్ కుమార్, విఠలరావ్, సందీప, పరశురామరావ్, సురేశ్‌రావ్, శ్రీనివాస్‌రావ్ లోకరె, కృష్ణమూర్తిరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న వీరశైవ విద్యాలయ ప్రిన్సిపాల్ మనోహర్

**బళ్లారి సిటీ, జూలై 31:** దార్వాడ్ గురుదేవ్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీపరీక్షలపై వీరశైవ మహావిద్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో శంకర్ హంచి, వీరేశ్ మేటి, శశికాంత్ వివిధ పోటీ పరీక్షల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ కార్యక్రమ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్లు వినోద్‌కుమార్, మల్లనగౌడ, రవికుమార్‌నాయక్, శరణబసవ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గృహనిర్మాణ కార్మికుల కార్యవర్గం ఎన్నిక



తాళూరు కట్టడ కార్మిక సంఘ కార్యవర్గ సభ్యులు

**తోరణగల్లు, జూలై 31 :** సండూరు తాలుకా తాళూరు గ్రామంలో రాష్ట్ర కట్టడ కార్మికులు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ నూతన కట్టడ కార్మిక సంఘం అధ్యక్షులుగా బండి గిడ్డ మౌలా, కార్యదర్శిగా బసవరాజు ఉపాధ్యక్షులుగా మహబూబ్ సాబ్, అకౌంటెంట్‌గా గౌరేష ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కట్టడ కార్మికుల జిల్లా ముఖ్యులు కాలుబా మాట్లాడుతూ కట్టడ కార్మికులకు విద్యాసౌకర్యం, శిక్షణ కార్యక్రమం, పింఛన్ సౌలభ్యం యాక్సిడెంట్ పరిహారం కల్పించాలని ప్రభుత్వానికి అర్జీలు సమర్పించినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇందుకోసం 5వ తేదీన ముఖ్యమంత్రి ఇంటివద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా తాలుకా అధ్యక్షులు వి దేవన్న, కంప్లి ఉన్నూర్‌సాబ్, పీరా సాబ్ మొదలగువారు పాల్గొన్నారు.

## పరీక్షాకేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు: డీసీ



**బళ్లారి సిటీ, జూలై 31:** ఆగస్టు 2వ తేది నుంచి 9వతేది వరకు పదవతరగతి సప్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూఉన్న 200 మీటర్ల ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలని ఆదేశించారు. ఈ పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు పనిచేయకుండాచూడాలని అనధికార వ్యక్తులు గుంపులు గుంపులుగా రాకుండా నిషేధం విధించారు. పరీక్షల పర్యవేక్షణలో ఉన్న సిబ్బందికి ఈ ఉత్తర్వులు వర్తించవని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


# నీట మునిగిన మండపాలు

- మరోసారి తుంగభద్ర ఉగ్రరూపం
- టీబీ డ్యామ్ 33 గేట్ల నుంచి నీటి విడుదల
- మళ్లీ గట్టుకు చేరిన మోటార్లు
- కంప్లి కోట వంతెనపై పారుతున్న నీరు
- రాకపోకలకు అంతరాయం

**కంప్లి, జూలై 31 :** తుంగభద్ర డ్యాంకు మళ్లీవరదపోటు ఎక్కువకావడంతో బుధవారం అధికారులు భారీ పరిమాణంలో నీటిని 33గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో హంపీ పుణ్యక్షేత్రంలో గతంలో లేనివిధంగా మండపాలన్నీ నీట మునుగుతున్నాయి. యథావిధిగా కోదండరామ ఆలయంలోకి నీరు చేరింది. అలాగే కంప్లి కోట వద్ద వంతెన మీదుగా మళ్లీ నీరు ప్రవహిస్తోంది. ఈ కారణంగా కంప్లి, గంగావతిల మధ్య రాకపోకలు బందయ్యాయి. రెండు మూడు రోజులుగా నీరు తగ్గుముఖం పట్టడంతో రైతులు మోటార్లను అమర్చి నదినుంచి నీటిని పొలాలకు సరఫరా చేసుకుంటున్నారు. కాని బుధవారం నీరు ఎక్కువ మోతాదులో రావడంతో మోటార్లను మళ్లీ గట్టుకు చేర్చారు. ఈ యేడాది అత్యధికస్థాయిలో నీరు రావడంతో బెళగోడు హాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, నది ఒడ్డున వుండే రైతులకు సాగు కష్టంగా మారింది, పొలాలకు మోటార్ల ద్వారా నీటిని మళ్లించే అవకాశం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాలుకా అధికారులు తహసీల్దార్, పురసభ ముఖ్య అధికారి, కంప్లి కోటలో నది ఒడ్డున వున్న మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. చేపలవేటకు నదిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు. కాగా ఈ యేడాదిలోనే రెండవసారి నదికి ఎక్కువ మోతాదులో నీరు చేరడం గమనార్హం.



మళ్లీ మోటార్లన్నీ గట్టుకు..



## జ్ఞానం పెరగాలంటే పత్రికలు చదవాలి

పత్రికా దినోత్సవంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్

**కంప్లి, జూలై 31:** విద్యార్థులు నలుమూలల నుంచి ప్రచురించబడే పత్రికలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ విజ్ఞప్తిచేశారు. పత్రికా దినోత్సవం సందర్భంగా కంప్లిలో బుధవారం కార్యనిరత పాత్రికేయుల సంఘం రెయిన్‌బో కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత్రికేయులు ఎండా వాన వర్షం ఎలాంటివి లెక్క చేయకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి నలుమూలల వుండే విషయాలను ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో పత్రిక రంగానికి ఎంతో విశిష్టత వుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కార్యనిరత సంఘం అధ్యక్షులు వలీ బాషా, తాలుకా అధ్యక్షులు వీరేష్ మాట్లాడుతూ, తాలుకా స్థాయిలో వుండే పాత్రికేయులకు స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రతి ఒక్కరు పత్రికలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వివిధరంగాల్లో రాణించిన వారికి, పాత్రికేయుల గృహిణులకు సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్ కుమార్, ఈవో శ్రీకుమార్, చెన్నబసవ రాజు, మల్లన్నగౌడ, మూకయ్యస్వామి, కార్యదర్శి రవికుమార్, ఫరూక్, షణ్ముఖప్ప, తదితరులు పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో రాణించినవారిని సన్మానిస్తున్న దృశ్యం

## స్వాతంత్ర్య దినోత్సవానికి సన్నాహాలు: డీసీ

**బళ్లారి సిటీ, జూలై 31:** 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నగరంలోని అనంతపురం రోడ్డులోని నూతన జిల్లాపాలనా భవనం హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలోని విమ్స్ జిల్లా స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఉదయం 9గంటలకు జిల్లా యంత్రాంగం నిర్వహించనున్న జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆగస్టు 15న ఉదయం 8-30గంటలకు నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ (మోతి సర్కిల్) దగ్గర ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం నగరంలోని విమ్స్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. ఈసారి దేవదాయ శాఖ మంత్రి జెండా అవిష్కరణ చేస్తారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు బృందాల వారీగా పరేడ్‌ను చక్కగా నిర్వహించేందుకు శిక్షణ తీసుకోవాలన్నారు. అర్హులైన వైద్యులతో అత్యవసర అంబులెన్స్, ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వ్యవస్థ, మరుగుదొడ్ల ఏర్పాటుచేయాలన్నారు. నగరంలోని విమ్స్ స్టేడియంను శుభ్రం చేసేందుకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీపాలంకరణ ఇతర కార్యక్రమాలు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కన్నడ సాంస్కృతిక శాఖ, డీడీపిఐ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఈవేడుకల్లో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తామన్నారు. జాతీయ స్వాతంత్ర్య పండుగను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో జిల్లాపంచాయితీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్‌శరణప్ప, ఉప జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, ఏఎస్పీ రవికుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

## అడవుల రక్షణలో రేంజర్ల కృషి అభినందనీయం

- ప్రపంచ రేంజర్ల దినోత్సవంలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

**బళ్లారి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** అటవీ శాఖ అధికారులు ప్రాణాలను పణంగా పెట్టి పర్యావరణాన్ని కాపాడుతున్నారని బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ రక్షణకు సరిహద్దులో మన సైనికులు పోరాడుతుంటే, అడవుల రక్షణలో ఫారెస్టు అధికారులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారన్నారు. బళ్లారిలోని ఫారెస్టు క్వార్టర్లలో బుధవారం ప్రకృతి ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి ప్రపంచ రేంజర్ల దినోత్సవం జరుపుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, సహజవనరులు కాపాడుకోవడంలోనే దేశ మనుగడ ఉంటుందని అన్నారు. అడవులను రక్షించేందుకు ఫారెస్టు బీటర్లు, వాచర్లు, ఇతర సిబ్బంది కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. సీసీఎఫ్ ఎవో సందీప్ హెచ్ సూర్యకాంతి మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 31న ప్రపంచ రేంజర్ల దినోత్సవం జరుపుకొంటున్నారన్నారు. ఈ సందర్భంగా అడవుల సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ గౌరవవందం చేస్తామని తెలిపారు. అలాగే అటవీశాఖ ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేశారు. మేయర్ నందీష్ బాబు మాట్లాడుతూ హరించి పోతున్న అడవులను కాపాడడం మనందరి బాధ్యత న్నారు. కార్యక్రమంలో ఉపమేయర్ సుకుమ్,బళ్లారి, విజయనగర జిల్లాల డీసీఎఫ్‌లు, ఆర్‌పీఎఫ్‌లు, రేంజర్ పాల్గొన్నారు.



ప్రకృతి భవనాన్ని ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే, మేయర్

## ఆరు నెలలైనా చెల్లింపులేవీ?

- కన్నడనాడు రైతు సంఘం నిరసన



డీసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**బళ్లారి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసి ఆరునెలలు కావస్తున్నా రైతులకు నగదు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బుధవారం కన్నడనాడు రైతు సంఘం నిరసన వ్యక్తం చేసింది. ముందుగా రాయల్ సర్కిల్ నుండి ర్యాలీగా వచ్చిన రైతులు డీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీసీ కార్యాలయ వర్గాలకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం నేతలు మాట్లాడుతూ, గత ఖరీఫ్‌లో జొన్న పంటను పండించి ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలకు విక్రయించామని, కాని ప్రభుత్వం ఇంత వరకూ డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు బాస్కర్‌రెడ్డి, పి. మంజునాథ, ఈరణ్ణ, ఎస్, చంద్రణ్ణ,ఎస్ నాగేంద్ర, గడిగి రుద్రగౌడ, శివమూర్తి, మంజునాథ గౌడ, సిద్దరామగన గౌడ, ప్రదీప్ రుద్రప్ప, శివశంకరప్ప, విశ్వనాథగౌడ, ఎం. ఎర్రిస్వామి, చంద్రారెడ్డి, తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పంచాయతీ అధ్యక్షుడు

**బళ్లారి గాంధీనగర్, జూలై 31:** ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావాలు చూపకుండా ఆరోగ్యాన్ని బాగుపరిచే ఆయుర్వేదిక్ వైద్యం అందుబాటులో ఉందని సోమసముద్రం గ్రామ పంచాయతీ అధ్యక్షులు పేర్కొన్నారు. కోళూరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కురుగోడు తాలూకా సోమసముద్రంలో బుధవారం ఆయుష్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆయుర్వేదిక్ మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, మలబద్ధకం, మోకాళ్లనొప్పులు తదితర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. వీటితోపాటు ఉత్తమ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన ఆహారం, అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో 250 మందికి పైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ మాధురి, డాక్టర్ సుజాత, డాక్టర్ తిప్పేస్వామిలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పర హోసళ్లి అధ్యక్షుడిగా ముత్తయ్య



నూతన అధ్యక్షుడు ముత్తయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిరుగుప్ప, జూలై 31 :** సిరుగుప్ప తాలుకాలో జరిగిన రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా ఉప్పరహోసళ్లి పంచాయతీ అధ్యక్షులుగా ముత్తయ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఇతరులెవరూ నామినేషన్ దాఖలు చేయనందున ముత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున బాలప్ప, పరమేష, నాగప్ప జడేస్వామి, పాలాక్షి గౌడ, సభ్యులు పాల్గొని పూలమాలలువేసి సన్మానించారు.

## ఆశా కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలి




ర్యాలీ చేస్తున్న ఆశా కార్యకర్తలు

**సిరుగుప్ప, జూలై 31:** తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని ఆశా కార్యకర్తలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సిరుగుప్ప పట్టణం సీడీపీవో భవనంలో ఆశా కార్యకర్తల ప్రథమ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశా కార్యకర్తలపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక భద్రత, సాంఘీక భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

# హోసూరు జోన్

## నిబంధనలు ఉల్లఘిస్తే.. వాహనాలను సీజ్ చేయాలి

రవాణా శాఖ అధికారులకు వినియోగదారుల సూచన



సమావేశంలో పాల్గొన్న రవాణాశాఖ బృందం

**హోసూరు(సిఫ్‌కాట్) జూలై 31:** నిబంధనలు ఉల్లఘించిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధించాలని వినియోగదారులు కోరారు. జిల్లా రవాణా కార్యాలయంలో బుధవారం వినియోగదారుల గ్రూపుల సమావేశం జరిగింది. జిల్లా రవాణా అధికారి దురైస్వామి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మణిమారన్, అసిస్టెంట్ శరవణన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల సంఘాల కార్యవర్గ సభ్యులు గుణశేఖర్, , ఇళంచెళియన్, వేలు, శ్రీనివాసులు, తమిళవన్, సిబ్బంది బస్ డిపో మేనేజర్లు పాల్గొన్నారు. సమావేశంలో వినియోగదారులు మాట్లాడుతూ, హోసూరు సర్కిల్లో భారీ వాహనాలు అధికంగా ఉన్నాయని, ఈ సందర్భంగా తారురోడ్లు అధిక లోడుల వల్ల పాడైపోయాయన్నారు. రోడ్లు ఎగుడుదిగుడుగా, గుంతలమయంగా కనిపిస్తుందన్నారు. దీంతో ద్విచక్ర వాహన ప్రమాదాలు జరిగి శారీరక వైకల్యంతో పాటు ప్రాణనష్టం సంభవిస్తున్నాయని, కాబట్టి నిబంధనలు ఉల్లఘించిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధించాలన్నారు. హోసూరు ప్రాంతంలో నడుపుతున్న ప్యాసింజర్ ఆటోలు అధిక ఛార్జీలు వసూలుచేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు దూమపానం చేసి వాహనాలను నడపవద్దని కోరారు. పాఠశాల పిల్లలను తీసుకువెళ్లే పాఠశాల వాహనాలను తనిఖీ చేసి ఉల్లంఘనలు తేలితే చర్యలు తీసుకోవాలన్నారు.

## భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

**బళ్లారి రూరల్ జూలై 31:** మోకా పోలీస్ స్టేషన్ పరిధిలోని మోకా గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం తన భార్య గంగమ్మను గొడ్డలితో విచక్షణ రహితంగా నరికి చంపిన కేసులో భర్త జడియప్పకు యావజ్జీవ శిక్ష విధించారు. ఈ కేసు వాదోపవాదాలు బుధవారం జరగగా పీడీ హళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ నిందితులను కోర్టుకు హాజరుపరిచారు. జడియప్ప భార్యను చంపిన విషయం రుజువుకావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు పీడీహళ్లి సర్కిల్ పోలీసులు తెలిపారు.

## నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనాల ప్రారంభం

**హోసూరు(కృష్ణగిరి) జూలై 31:** బర్గూరు పంచాయతీ యూనియన్, చిన్నప నమూడ్లు పంచాయతీ, అసెంబ్లీ మెంబర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రాజెక్టు క్రింద రూ.13 లక్షల37 వేలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఆహార సరఫరాశాఖ మంత్రి, బుధవారం జిల్లాకలెక్టర్ సమక్షంల్లో కొవ్వొత్తి వెలిగించి ప్రారంభించారు. వీరితోపాటు బర్గూరు అసెంబ్లీ సభ్యుడు మతియళగన్, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు మణిమేఘలై నాగరాజ్ పాల్గొన్నారు. కృష్ణగిరి కొత్త బస్ స్టేషన్ వద్ద, రవాణా శాఖ తరపున, కృష్ణగిరి-బెంగళూరు రూట్ కొత్తబస్సులను బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాకలెక్టర్ కె.ఎం.సరయు, బర్గూరు అసెంబ్లీ సభ్యుడు మతియళగన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని కొవ్వొత్తి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి

## హోలబావి తండాలో అతిసార

- వాంతులు, విరేచనాలతో 50 మంది ఆస్పత్రిలో చేరిక

**రాయచూరు, జూలై 31 :** జిల్లాలోని లింగసుగూరు తాలూకా హోలబావి తండాలో వాంతులు, విరేచనాలతో 50 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. మంగళవారం రాత్రి ఈ సమస్య తలెత్తడంతో బాధితులందరినీ తాలూకా ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. అస్వస్థతకు గురైన వారిలో అన్ని వయసుల వారు ఉండగా తాండాలో కలకలం రేగింది. అస్వస్థతకుగల కారణాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా బుధవారం తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక చికిత్సతో పాటు యోగేశ్వరి (8), దిలీప్ (4), సునితా (21), చందమ్మ (44), జుమ్మాబాయి (28), గోజిబాయి (72), కమలాబాయి (28), నందీశ్ (14), పరవీశ్ కుమార్ (5) శివప్ప (29), రవి (20)లను తాలూకా ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై స్పందించిన క్షేత్రశిక్షణాధికారి తమ పాఠశాలకు అతిసారకు ఎలాంటి సంబంధంలేదని వైద్యశిబిరం ఏర్పాటుకు అనుమతించా మన్నారు. వైద్య శిబిరాన్ని సందర్శించిన అధికారులు ఎవ్వరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని పూర్తిగా అందరు కోలుకున్నారని, పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు


## ప్రార్థనాలయంపై బీరు బాటిళ్లతో దాడి

**రాయచూరు, జూలై 31:** జిల్లాలోని సిరవార పట్టణం బస్‌స్టాండ్ సమీపంలోని ఓ ప్రార్థనామందిరంపై మంగళవారం రాత్రి కొద్దిమంది నిందితులు ఖాళీ బీర్ బాటిళ్లతో దాడి చేశారు. రాత్రి వేళ నిర్వహించే ప్రార్థనల అనంతరం కొంత మంది అక్కడే కూర్చుని ఉండగా, ఒక్కసారిగా నిందితులు ఖాళీ బీరుబాటిళ్లతో దాడి చేశారు. బాటిళ్ల చెల్లచెదరుగా ముక్కలై పడిపోవడంతో లోపల ఉన్నవారు భయభ్రాంతులకు గురయ్యారు. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడితో చుట్టుపక్కల ఇళ్లవారు సైతం ఆందోళనకు గురికాగా పెద్ద ఎత్తున యువకులు అక్కడికి చేరుకుని నిరసనకు దిగారు. ఈ దశలో అక్కడికి చేరుకున్న సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వారిని సముదాయించి నిందితులు ఎలాంటివారైన వారిని తప్పకుండా అరెస్టు చేస్తామని తమకు సహకరించాలంటూ వారిని శాంతింప చేయడంతో ఆందోళన విరమించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న ఉన్నతాధికారులు నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని హామి ఇవ్వడంతో వారు శాంతించారు. కాగా బుధవారం పోలీసులు ఈ సంఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులు సాగర్ నాయక్, రంగనాథ కురుబరు, బసవ కబ్బేర, వీరేశ్ కబ్బేర, విజయ కొలిమి, సాబయ్య నాయక్, పరశురామ జోగేరలను అరెస్టు చేశారు సీసీటీవీ కెమెరా ఫుటేజీ ఆధారంగా వీరిని అరెస్టు చేశారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

### విద్వాన్ 'టైగర్' వరదాచారి (జయంతి)



కర్ణాటక సంగీత గాత్ర విద్వాం సుడు, విద్వాన్ 'టైగర్' వరదాచారి 1876 ఆగస్టు 1న తమిళనాడు రాష్ట్రం కొలత్తూరు ప్రాంతంలో జన్మించారు. పట్నం సుబ్రమణియ అయ్యర్ వద్ద 14వ యేట నుంచి సంగీతంలో తర్ఫీదు పొంది క్రమేపీ కర్ణాటక సంగీత గాత్రంలో రాణించారు. మంచి వాగ్గేయ కారుడిగా గుర్తింపు పొందారు. సంగీత ప్రతిభను గుర్తించిన మైసూరు మహారాజు కృష్ణరాజ ఒడయార్ ఆయనకు 'టైగర్' బిరుదును, తోడాను ప్రదానం చేశారు. వేగవంతమైన సంగతులు పాడడం ఆయన ప్రత్యేకత. మద్రాస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలోని 'టీచర్స్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్'కు ప్రిన్సిపాల్‌గాను, అన్నామలై విశ్వవిద్యాలయం సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గాను వ్యవహరించారు. 'సంగీత కళానిధి' పురస్కారం అందుకున్నారు. 1950 జనవరి 31న కన్నుమూశారు.

### దేవరకొండ బాలగంగాధర తిలక్ (జయంతి)



దేవరకొండ బాలగంగాధర తిలక్ 1921 ఆగస్టు 1న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకా మండపాక గ్రామంలో జన్మించారు. ఆధునిక తెలుగు కవి. భావుకత, అభ్యుదయం ఆయన కవితా లక్షణాలు. వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభా సంపదతో ఉన్నత శిఖరాలకు చేర్చారు. తెలుగు, ఆంగ్లభాషలలో చక్కని పాండిత్యం ఉంది. 1966 జూలై 1న మరణించారు. కుందుర్తి ఆంజనేయులు పీఠికతో 1968లో ముద్రితమైన ఆయన కవితల సంపుటి 'అమృతం కురిసిన రాత్రి'కి 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

### మీనాకుమారి (జయంతి)



ట్రాజెడీ క్వీన్‌గా గుర్తింపు పొందిన మీనాకుమారి 1933 ఆగస్టు 1న ముంబైలోని దాదర్ ప్రాంతంలో జన్మించారు. ప్రముఖ భారతీయ నటి, గాయని, కవయిత్రి. అసలు పేరు మహజబీన్ బనో. 'నాజ్' పేరిట రచనలు చేశారు. బాలీవుడ్‌లో అత్యంత గొప్ప నటీమణిగా పేరొందారు. చిన్నతనం నుంచి చివరివరకు 30 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 92 సినిమాల్లో నటించారు. పలు సినిమాలు క్లాజిక్‌లుగా నిలవడం విశేషం. పాకీ జా, సాహిబ్ బీబీ ఔర్ గులాం, మేరే అప్నే, ఆర్తీ, బైజు బవారా, పరిణీతా, దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయీ, ఫుట్‌పాత్ తదితర సినిమాలు ఎంతో పేరొందాయి. ఉత్తమనటిగా పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందు కున్నారు. 1972 మార్చి 31న కన్నుమూశారు.

# ఆదర్శప్రాయులు సీవీ వెంకటరాయప్ప

● పంచగిరి విద్యాసంస్థల ట్రస్టు చైర్మన్ నవీన్ కిరణ్



సీవీ వెంకటరాయప్ప జయంతిలో ప్రముఖులు

**చిక్కబళ్ళాపుర, జూలై 31:** విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన సీవీ వెంకటరాయప్ప ఆదర్శప్రాయులని పంచగిరి విద్యాసంస్థల ట్రస్టు చైర్మన్ నవీన్‌కిరణ్ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని సీవీవీ ప్రాంగణంలో కేవీ, పంచగిరి విద్యాట్రస్టు ఆధ్వర్యంలో 28వ ధార్మిక దినోత్సవం, సీవీవీ 109వ జయంతిలో ఆయన ముఖ్యులుగా పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన చిక్కబళ్ళాపురలో ఒకప్పుడు చదువుకు సౌకర్యాలు అంతగా లేని రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుతో విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి ఒక్కరికి విద్య అందుబాటులోకి తెచ్చేలా తీర్చిదిద్దడం ద్వారా క్రమేపీ జిల్లా కేంద్రం స్థాయికి ఎదిగేందుకు దోహదపడ్డారన్నారు. పాఠాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. కాగా సంస్థ సామాజిక సేవలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారని ఇందుక యువత ఉత్సాహంగా పాల్గొంటూ రక్తదానంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. బాలగంగాధరనాథ స్వామిజీ విద్యాసంస్థల సీఈఓ శివరాం రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవంతో సామాజిక చైతన్యం కలిగించారన్నారు. ఎన్నో కుటుంబాలలో ఆలంబనగా నిలిచిన సీవీవీని స్మరించుకోవడం అందరి కర్తవ్యమన్నారు. జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఖాదీ గ్రామోద్యోగ మహామహామండలి మాజీ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, రిటైర్డు సెక్యూరిటీ ఆఫీసర్ లోకేశ్, పంచగిరి విద్యాట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వివిధ రంగాల సాధకులను, పదవీ విరమణ పొందినవారిని సత్కరించారు. సాంస్కృతిక, క్రీడా పోటీల విజేత విద్యార్థులను అభినందించారు.

## 17న భారీ ఉద్యోగమేళా



మేళా వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** బెంగళూరు నగరంలో పెను సమస్యగా ఉన్న నిరుద్యోగాన్ని నియంత్రించే దిశలో భారీ ఉద్యోగమేళా ఆగస్టు 17న జరగనుంది. బీబీఎంపీ మాజీ ప్రతిపక్షనేత ఎన్ఆర్ రమేశ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ 17న శనివారం పద్మనాభనగర్‌లోని దేవేగౌడ పెట్రోల్‌బంకు సమీపాన గల కార్మెల్ స్కూల్ పక్కనగల పుట్టలింగయ్య క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5వరకు మేళా కొనసాగుతుందన్నారు. మేళాను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముఖ్యులు సుధామూర్తి, అశ్విని పునీత్‌రాజ్‌కుమార్‌లు ప్రారంభిస్తారన్నారు. 150కుపైగా కార్పొరేట్ కంపెనీలు, ఎంఎన్‌సీలు పాల్గొని సుమారు 3వేలకుమందికిపైగా ఖాళీలను వెంటనే భర్తీ చేస్తాయన్నారు. ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీ, డిగ్రీ, పీజీ పాస్ లేదా ఫెయిల్ అయినవారు కూడా పాల్గొనే అవకాశం ఉందన్నారు. వారి ఉత్తీర్ణతకు తగిన అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఆగస్టు 10వతేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 98441 59891, 9108636275లకు సంప్రదించాలని తెలిపారు.

## పీడీఓకు ఆత్మీయ వీడ్కోలు



పీడీఓ నారాయణప్ప సన్మాన కార్యక్రమంలో పంచాయతీ ముఖ్యులు

**బంగారపేట, జూలై 31:** తాలూకాలోని చిన్నకోటె గ్రామపంచాయతీ పీడీఓ పి నారాయణప్ప రిటైర్మెంట్ నేపథ్యంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సునందమ్మ మాట్లాడుతూ స్వార్థం, అహంకారం వీడి విధి నిర్వహణ, మానవత్వం చాటుకోవడం ద్వారానే ప్రభుత్వసేవకు సార్థకత సాధ్యమని అభిప్రాయపడ్డారు. పంచాయతీ అభివృద్ధి అధికారి నారాయణప్ప సేవలను ప్రశంసించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్మెంట్ తప్పదని ఆయా విభాగాల్లో వారి విధులు చక్కగా నిర్వహించడం ద్వారా ప్రజల మనన్న పొందగలరన్నారు. సరళమైన వ్యక్తిత్వం, క్రమశిక్షణతో ఇతరులకు మాదిరిగా నిలిచారన్నారు. 25ఏళ్ల సుదీర్ఘసేవలందించి ఉత్తమఅధికారి అందరి అభిమానం పొందారన్నారు. ఆయన విశ్రాంత జీవితం సుఖశాంతులతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షుడు వివేక్ కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పీడీఓగా సుమారు మూడేళ్లపాటు గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక సదుపాయాలు, నరేగా కింద వందలాది అభివృద్ధి పనులు చేయించారన్నారు. సన్మానం స్వీకరించిన పీడీఓ నారాయణప్ప మాట్లాడుతూ చిన్నకోటె గ్రామపంచాయతీలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు అందరి సహకారంతో తనవంతు ఉత్తమపాలన అందించేందుకు కృషి చేశానన్నారు. అలాగే తర్వాత వచ్చే అధికారి ఇలాంటి సహకారం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షులు, సభ్యులు సుబ్రమణి, లక్ష్మయ్య, శకీలా, లక్ష్మమ్మ, మునివెంకటప్ప, నళిని, వరదరాజయ్య, అమరనాథ, కవితా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి సేవలు అభినందనీయం



ఉపాధ్యాయుడు నారాయణస్వామికి సన్మానం

**బాగేపల్లి, జూలై 31:** పిల్లలకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడు పి.ఎన్. నారాయణస్వామి బదిలీపై బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. విద్యతోపాటు సామాజిక, సాహిత్య, క్రీడా అంశాలపై అవగాహన కల్గిన ఉపాధ్యాయుడి సేవలు అభినదనీయమని ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో నారాయణస్వామికి శాలువా, పూలమాలతో సత్కరించి గౌరవించారు. 14ఏళ్లపాటు సేవలందించిన నారాయణస్వామి ప్రతిఏటా ఉత్తమఫలితాలు సాధించడంలో ప్రత్యేక కృషి చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమని అక్కడ కూడా చక్కటి సేవలందించాలని అభిలషించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు.

## గుంజూరులో పటాలమ్మ దేవి దీపోత్సవం



ప్రత్యేకపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి

**మహదేవపుర, జూలై 31:** నియోజకవర్గంలోని గుంజూరు గ్రామంలో పటాలమ్మదేవి గ్రామజాతరలో భాగంగా దీపోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వందలాదిమంది భక్తులు గ్రామదేవతను దర్శించుకున్నారు. గుంజూరు, బళగెరె, గుంజూరుపాళ్య, గుంజూరు హొసహళ్ళి గ్రామాలకు చెందినవారు గ్రామదేవత పటాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ వీధులలో దీపాలతో మహిళలు ఊరేగారు. వీరగాసె, డొళ్ళుకుణిత, తమటె, మంగళ వాద్యాల కళాబృందాలు దీపోత్సవానికి వన్నె తెచ్చాయి. వర్తూరు, కాడుగూడి, రామగొండనహళ్ళి సహా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. బుధవారం ఉత్సవంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి, మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రముఖులు మనోహరరెడ్డి, నాగేశ్, రామకృష్ణప్ప, బళగెరె రాజారెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య బీమా మొత్తం మంజూరు



లబ్ధిదారులకు బీమా మొత్తం మంజూరు పత్రం అందజేత

**శిడ్లఘట్ట, జూలై 31:** ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనా కార్యాలయంలో ఆరోగ్య రక్షా బీమా మొత్తాన్ని మంజూరు పత్రాలను అందచేశారు. తాలూకా పరిధిలోని స్వసహాయ సంఘాల సభ్యులు, యోజనా కార్యకర్తలకు మొత్తం 33మందికి రూ.4,91,960 క్లెయిమ్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ సామాజిక సేవలను కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు చేయూత ఇస్తోందన్నారు. కేవలం రూ.299 ప్రీమియంకే గరిష్ఠంగా రూ20వేల బీమా సౌలభ్యం కల్పిస్తున్నారన్నారు. సంస్థ తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ శివణ్ణకు ఆత్మీయ వీడ్కోలు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కేఎస్ శివణ్ణకు వీడ్కోలు సందర్భంగా..

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** బెంగళూరు ఆంధ్రజ్యోతి విభాగంలో దశాబ్దన్నర కాలంపైగా ఫొటోగ్రాఫర్‌గా కేఎస్ శివణ్ణ ఉత్తమ సేవలందించారని జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్ తెలిపారు. శివణ్ణ పదవీ విరమణ కార్యక్రమం కార్యాలయంలో బుధవారం జరిగింది. శివణ్ణను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శివణ్ణ సేవలను ఉద్యోగులందరూ గుర్తు చేశారు. జీఎం శ్రీకాంత్ మాట్లాడుతూ శివణ్ణ ఫొటోగ్రాఫర్‌గా మీడియాలో మంచిపేరు పొందారని అన్నారు. డీజీఎం ఎంఆర్ సుధాకర్ మాట్లా డుతూ శివణ్ణతో తమకు రెండున్నర దశాబ్దాల అనుబంధమని గుర్తు చేసుకున్నారు. ఉద్యోగి పదవీవిరమణ సహజమైనా ఆయన సేవలు గుర్తు చేసుకునే రోజు అన్నారు. బ్యూరో ఇన్‌చార్జ్ ఎం.రవి, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ ఎస్.బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ శివణ్ణ శేషజీవితం ఆరోగ్యంగా ఉండాలని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. మాజీ ఉద్యోగి కల్యాణ్‌రెడ్డితోపాటు ఆంధ్రజ్యోతి అడ్మినిస్ట్రేషన్, ఎడిటోరియల్, అడ్వర్టయిజ్‌మెంట్, సర్క్యులేషన్, ప్రింటింగ్ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు లారీలు ఢీ

● ఒకరి మృతి ● ముగ్గురికి గాయాలు


**పెనుకొండ రూరల్, జూలై 31:** మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై పుట్టపర్తికి వెళ్లే బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో డ్రైవర్ గొల్ల శ్రీనివాసులు(30) మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలైనట్లు కియ ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం కో లార్ జిల్లా మాలూరు తాలూకాకు చెందిన లారీ డ్రైవర్ గొల్ల శ్రీనివాసులు, క్లీనర్ ముస్తఫా కలిసి కోలార్ నుంచి రాయ చూర్‌కు లారీలో టమోటా లోడ్‌తో బయలు దేరారు. ఈ క్రమంలో పెనుకొండ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సమయంలో వాహనం ఎడమ నుంచి కుడివైపునకు వెళ్లి హైదరాబాద్ నుంచి బెంగళూ రుకు బంగాళదుంపలతో వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో టమోటా లారీ డ్రైవర్ శ్రీనివాసులు అక్కడి కక్కడే మృతిచెందగా, రెండు లారీల క్లీనర్లు ముస్తఫా, శీను, బంగాళాదుంపల లారీ డ్రైవర్ శ్రీరామ్ గాయపడ్డారు. వారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

## మళ్లీ పెరిగిన వరద

**బొమ్మనహాళ్, జూలై 31:** తుంగభద్ర జలాశయానికి మళ్లీ వరద పోటెత్తుతోంది. దీంతో 33 క్రస్ట్‌గేట్లు (25 గేట్లు మూడు అడుగులు, మరో 8 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 1,23,381 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 9379 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ వరదనీరు వచ్చి జలాశయంలోకి చేరుతున్నాయి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 74,095 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,32,760 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105 టీఎంసీలు ఉండగా బుధవారం సాయంత్రానికి 1631.30 అడుగులతో 99.040 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1138 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.




డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న వరద జలాలు

## గుంతకల్లు-బెంగళూరు రైలును నడపాలి

- అనంతపురం ఎంపీ అంబికా

- ఉమ్మడి జిల్లా రైలు సమస్యలపై పార్లమెంటులో వాణి



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

**గుంతకల్లు, జూలై 31:** అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రైల్వే సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా రైల్వే సమస్యలపై బుధవారం సుదీర్ఘంగా ప్రసంగించారు. బెంగళూరు-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు పార్లమెంటు సెగ్మెంట్ కేంద్రాల్లో రిక్వెస్టు స్టాపింగ్ ఇవ్వాలని, గుంతకల్లు-బెంగళూరు డే ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని, సికింద్రాబాద్-కర్నూలు మధ్య నడిచే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకూ పొడిగించాలని, నిలిపి వేసిన బెంగళూరు-విజయవాడ ప్యాసింజరు రైలును పునరుద్ధరించాలని కోరారు. కొవిడ్ సమయంలో అనంతపురం జిల్లా నుంచి నడిపిన కిసాన్ రైళ్లను రైతుల ఉపయోగం కోసం పునరుద్ధరించాలని కోరారు. మచిలీపట్టణం-యశ్వంతపూర్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను డెయిలీ ఎక్స్‌ప్రెస్‌గా మార్చాలని కోరారు. హిందూపురం- విజయవాడ, హిందూపురం-కాచిగూడ మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టాలని కోరారు. ధర్మవరం-నర్సాపురం (నెం. 17247) రైలును హిందూపురం నుంచి బయలుదేరేలా మార్చాలని, సికింద్రాబాద్-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు హిందూపురంలో రిక్వెస్ట్ స్టాప్ కల్పించాలని కోరారు. హిందూపురం-బెంగళూరు ప్యాసింజరు రైలులో టాయిలెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. గుంతకల్లులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీని, కసాపురం రోడ్డు వంతెనను వెడెల్పు చేయాలని, బళ్లారి బైపాస్‌లో ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే లైన్ల వద్ద నిర్మించిన గోడ వల్ల పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ద్విచక్ర వాహనాలు వెళ్లే వీలును కల్పించాలని విన్నవించారు.

## సమాజ సేవకుడికి ప్రశస్తి

**పావగడ, జూలై 31:** సమాజసేవకుడు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్‌కు కన్నడ అభివృద్ధి సాధికార, కల్పవృక్ష యువనగర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కల్పవృక్ష ప్రశస్తిని అం దించి సన్మానించారు. డాక్టర్ పురుషోత్తం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కంపలప్ప, డాక్టర్ సంతోష్, రవికుమార్, నరసేగౌడ, సత్యలోకేష్, పరమేశ్ తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన సేవారంగాల్లో మ రింత ముందడుగువేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

## నేడు బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

**పావగడ, జూలై 31:** బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాం గ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో ఎస్సీ, ఎస్టీ నిధులను దుర్వినియోగం చేసి, ఆ సామాజికవర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని ఈ నేపథ్యంలో బీఎస్పీ తరుపున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపడుతున్నట్లు తెలిపా రు. సంఘ సంస్థలు మద్దతు పలికి విజయవంతం చేయాలని కోరారు.

## నదిలోకి దూకిన మహిళ

» రక్షించేయత్నంలో భర్త సహా బంధువు గల్లంతు

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** కలబురగి జిల్లా భీమా నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన భార్యను రక్షించే ప్రయత్నంలో భర్తతోపాటు బంధువు గల్లంతు అయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అఫ్జల్‌పుర తాలూకా సొణ్ణగ్రామం భీమానది బ్రిడ్జి వద్ద జరిగింది. వివాహిత లక్ష్మి శివానంద్ (28) నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించారు. గమనించిన భర్త శివానంద్‌తోపాటు సమీప బంధువు రాజు అంకలిగలు నదిలో దూకి రక్షించే ప్రయత్నం చేశారు. సుమారు 800 మీటర్ల దూరంలో లక్ష్మిని గుర్తించిన మత్స్యకారులు రక్షించారు. అయితే శివానంద్, రాజులు నదిలో గల్లంతయ్యారు. బాధితురాలు లక్ష్మిని వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కలబురగి ఎస్పీ అడ్డూరు శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరి శీలించారు. గల్లంతైనవారి కోసం గాలింపులు జరుపుతున్నారు.

## దర్శన్‌కు జైలు భోజనమే

» విచారణ 20కు వాయిదా

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** చిత్రదుర్గ రేణుకా స్వామి హత్యకేసులో అరెస్టు అయిన నటుడు దర్శన్‌కు జైలు భోజనమే కొనసాగనుంది. ఇంటి భోజనం కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకున్న పిటీషన్‌ను బుధ వారం విచారణ జరిపిన న్యాయమూర్తి నాగప్రసన్న ఏక సభ్య ధర్మాసనం ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేశారు. ఇప్పటికే సివిల్‌కోర్టులో వివాదం కొట్టివేసిన మేరకు హైకోర్టును ఆశ్రయించారు.

### దోష నివారణ పూజలంటూ...

## టెకీపై అత్యాచారం

**బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** దోష నివారణ పూజలు చేస్తానని నమ్మించిన అర్చకుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువతి ఫిర్యాదు మేరకు బాగలకుంటె పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. హాసన్ జిల్లా అరసికెరె ప్రాంతానికి చెందిన ఓ యువతి నగరంలోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె బెంగళూరులోని బాగలకుంటె ప్రాంతంలో నివసిస్తున్నారు. ఏప్రిల్‌లో ఆమె అరసికెరె తాలూకా గొల్లరహళ్లి పురదమ్మ ఆలయ అర్చకుడు దయానంద్‌తో శాస్త్రం అడిగేందుకు వెళ్లారు. ఇలా పరిచయమయ్యాక జూలై 6న దయానంద్ బెంగళూరుకు వచ్చాడు. ప్రత్యేక పూజలు చేయిస్తానంటూ ఆమెను నమ్మించాడు. మత్తు వచ్చేలా బూడిదలాంటి పొడి చల్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో వీడియోలను చిత్రీకరించుకున్నాడు. ఆ తర్వాత బాధితురాలికి ఫోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. వీడియోలు, ఫొటోలు పంపి డబ్బులు ఇవ్వకుంటే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఇలా రూ.1.20లక్షల నగదు కాజేశాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాగలకుంటె పోలీసులు దయానంద్‌ను మంగళవారం అరెస్టు చేశారు.

## నీటి పనులకు వైసీపీ కౌన్సిలర్ల అడ్డంకి

**హిందూపురం, జూలై 31:** పట్టణానికి నీరందించే గొల్లపల్లి పైప్‌లైన్‌కు సంబంధించి మరమ్మతు పనుల కోసం ఆమోదం తెలపాలని చైర్‌పర్సన్ ఇంద్రజ కోరగా... వైసీపీ సభ్యులు వాయిదావేస్తూ మధ్యలోనే వెళ్లిపోయారు. స్థానిక మున్సిపల్ కార్యలయంలో బుధవారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను చదువుతున్న సమయంలో ఆరో అంశం వచ్చే సరికి వైసీపీ కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతూ... అధికారులు మరమ్మతు పనులకు మించి ఎస్టిమేషన్ వేశారన్నారు. అసలు వారు తయారుచేసిన ఎస్టిమేషన్ మరమ్మతులకా లేక కొత్తవాటిని కొనుగోలుచేసేందుకా అని ప్రశ్నించారు. దీనిపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఇదే సందర్భంలో టీడీపీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులకు అడ్డుపడకూడదన్నారు. ఆ నిధులు 2019కి సంబంధించినవని, ఇప్పుడు ఆమోదించకపోతే వెనక్కుపోయే అవకాశం ఉందన్నారు. పట్టణానికి నీటి సమస్య పరిష్కారం కావాలంటే సభ్యులు ఆమోదించాలన్నారు. కానీ వైసీపీ సభ్యులు మాత్రం తాము ఒప్పుకునేది లేదని తెలిపారు. సివిల్ వర్కులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తే తప్ప ఏపీసీ గ్రాంట్‌కు సంబంధించి పనులు చేపట్టకూడదని వైసీపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎన్నో అక్రమాలు జరిగాయని, అప్పుడు విచారణకు డిమాండ్ చేయకుండా ఇప్పు టడు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధ టతి కాదన్నారు. అక్రమాలు జరిగి ఉంటే దానిపై కమిటీ వేయించడానికి తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకునేలా తాము కోరుతామన్నారు. అజెండాలో 36అంశాలుండగా 11అంశాలు మినహా మిగిలిన వాటికి ఆమోదం తెలుపుతున్నట్లు చైర్‌పర్సన్ ఇంద్రజ ప్రకటించారు.

## నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

**పుట్టపర్తి, జూలై 31:** స్థానిక శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దకమ్మవారిపల్లి రోడ్డులోని ఆస్పత్రిలో బెంగుళూర్ రామయ్య మెడికల్ కాలేజ్ సహకారంతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 30 సంవత్సరాలు పైబడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.